గించే అతని 'మిల్ట్రీ మీసాలు' యిప్పుడు లేవుగూడాను.

ఖాళీగావున్న నా కుడిచేతి గుప్పిటని మూస్తూ, కోపాన్ని దిగమింగుతూ, ఆ దంపతుల ఖబుర్లలో జోక్యం లేకుండా కూర్చున్నాను. తిరిగి తొమ్మిది గంటలకి నా అద్దె గదిని చేరుకున్నాను.

మరునాడుదయమే వాళ్ళు విశాఖపట్టణం వెళ్ళివుంటారు!

ఇది జరిగిన రెండోనాడు సుబ్బారావు దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. ఆత్రంగా చదివాను. ఆకర్షించిన వాక్యాలు యివి:

"బందర్లో బోరుకొడుతోంది. నువ్వొక్కసారి వొస్తే ఎంత బావుంటుందని. పైగా— నువ్వు నేనూ మనందరం మిస్సయిన సోఫియా లారెన్ పిక్చరొకటి విజయలక్ష్మిలో ఆడుతోంది. బందరులో యీ మధ్య సివిలిజేషన్ పెరిగిపోతోందయ్యోవ్. వొస్తావుగా."

సుబ్బారావు కొత్తిగా పూర్వకాలపు మనిషైనందుకు సంతోషించాను. అతన్ని యిన్నాళ్ళ అపార్థం చేసుకున్నందుకు చింతించాను.

శనివారం బందరు వెళ్లాను. సుబ్బారావింటి దగ్గర రిక్షా దిగాను. నాకోసమే యెదురు చూస్తున్నట్టు అతను వరండాలో కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. నన్ను చూడగానే 'హల్లో' అన్నాడు. ఆపైన ఇంటికి తాళంవేసి నాతోపాటు రోడ్డు ఎక్కాడు. దార్లో అన్నాడు —

"త్వరలో నేను తండ్రిని కాబోతున్నానోయ్."

— దొరికింది. క్లూ దొరికింది. వాళ్లావిడ పుట్టింటికి వెళ్ళిందికాబట్టి సుబ్బారావు నాకు ఉత్తరం రాశాడుగానీ - లేకపోతే - నన్నుగానీ, సోఫియాలారెన్ పిక్చర్నిగానీ, విజయలక్ష్మి థియేటర్నిగానీ లెఖ్ఖచేయునా మా సుబ్బారావు? సుబ్రావ్! పోనిచ్చావ్ కాదోయ్ నీ పెళ్ళయిన పెద్దమనిషి బుద్ధి.

సినిమా అయింతర్వాత మా యింటికెళ్ళాను. నిద్రపోయేముందు అక్కయ్య కూతురు గుర్తుకొచ్చింది. ఇంకా మా పెళ్లికి వాయిదా వేయడం భావ్యంకాదు. నిజానికి ఆ పిల్లేకదా నాకుదూరంకానినేస్తం! ☐☐☐

---


● ఒక ముంగిస ఒక పెద్ద హోటల్లోకి వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చింది. తాగిన తరవాత కౌంటర్ దగ్గిరికి వెళ్ళి పదమూడు నయాపైసలు బల్లమీద పెట్టింది.

"కాఫీ ఇరవై పైసలండి" అన్నాడు హోటలతను.

ముంగిస జేబులోంచి ఇంకో ఏడు నయాపైసలు తీసి ఇచ్చింది. హోటలతను "థాంక్స్" అని నవ్వుతూ "మా హోటలుకి ముంగిస రావడం ఇదే మొదటిసారి" అన్నాడు.

"మీరిచ్చే కాఫీ ఇరవై పైసలైతే ఇదే ఆఖరిసారికూడాను." అంది ముంగిస.





# వాన కురిసిన రోజు

టి. ఎస్. లక్ష్మి

టైమ్ము నాలుగు గంటలైంది. టిఫిన్ కాఫీలపని పూర్తిచేసి, వంటగది బయట కొచ్చింది రాధ బి. ఎ.

"నాకు కంచిపట్టు పరికిణీ కావాలి.... ఈ ...ఈ...." ఈ తో దీర్ఘాలాపన చేస్తోంది ఐదు సంవత్సరాల సుజాత.

"అమ్మా! చింతపండు ..... అమ్మగోరూ, చింతపండు" పనిదాని కేకలు. మైలుదూరంనించి పిలుస్తున్నట్టు.

"అమ్మా! బట్టలు లెక్కజూసుకోం డమ్మా....ఇల్దిపోవాల" చాకలిదాని తొందర.

"ఢాం ఢాం.... ఢాం" పౌడరు డబ్బాని నేలకేసి కొడుతూ, కిందపడ్డ పౌడరుని వళ్ళంతా పూసుకుంటున్న రెండున్నర సంవత్సరాల శీను.

రాధ గట్టిగా చెవులుమూసుకుని, గదిలోకెళ్ళి తలుపు గడియపెట్టింది. గాలిలో తేలి మోతలు, అరుపులు, ఏడుపులూ గదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. అలిసిన శరీరం మన

సుని నీరసపెట్టింది. కోపంతో వళ్ళు వేదెక్కింది. దబేలున తలుపుతీసుకుని మహాకాళిలా బయటకొచ్చింది. ఫెడీఫెడీ సుజా వీపు కందిపోయింది. అది వెక్కుతూ నేల మీద పడుకొంది. "బుద్ధిలేనిదానా! అలా అరుస్తావెందుకే? చింతపండూ లేదూ, సింగినాదంలేదూ మట్టివేసి తోము." ఈ ఉరుముకి హడిలిపోయింది ముసలి పనిమనిషి.

రివ్వు రివ్వున చాకలిదానిమీద కొచ్చింది.

"ఏవిటీ వీహడావిడి? ఎక్కడన్నా ఇళ్ళంటు కున్నాయా? పో అవతలికి? లెక్కాగిక్కా ఇప్పుడేం చూడను. రేపు దయచెయ్యి." చాకలిది గుడ్డు అప్పగించి చూస్తోంది.

"వెధవా! పొదరు తగలబెడుతున్నావా?" డబ్బా లాక్కుని వాడిని ఎత్తి కుదేసింది. "నాకు పంచదార పెత్తమ్మా" వాడు అల్లరికి ఇంకొక టాపిక్ ఎన్నుకున్నాడు పొడరు డబ్బా పోగానే. ఆరున్నొక్క రాగం మొదలుపెట్టాడు పంచదారకోసం.

రాధ కళ్ళు మూసుకుని మంచంమీద పడింది. పిల్లలిద్దరి ఏడుపులు తారస్థాయి నందుకుంటున్నాయి. చాకలి, పనివాళ్ళ సద్దుమణిగింది.

"అమ్మా పూలు తెచ్చానమ్మా" పూల కోసం పోయిన పనిపిల్ల తిరిగొచ్చింది. దాన్ని చూడంగానే రాధ ప్రాణాలు సగం తేరుకున్నాయి. బీరువాతెరిచి కంచి వరికిణీ, తీసి సుజా మీద పడేసింది. డబ్బా తీసి రెండు బిస్కట్లూ ఇద్దరికీ చెరొకటిఇచ్చింది. "నాకు ఇంకోతి...." వాడింకా దీర్ఘం తీస్తున్నాడు. రాధ నిస్పృహాయంగా ఇంకో బిస్కట్టు వాడి కిచ్చింది.

"ఒసేయ్ పిల్లా! వీళ్ళిద్దర్నీ కాసేపు అట్లా షికారు తీసుకుపో. గంట దాకా ఇంటికి తీసుకువచ్చావా వొళ్ళు వాతలు తేల్తాంది జాగ్రత్త!" పనిపిల్లమీద విరుచుకు పడింది. అది బిక్కుబిక్కు మంటూ పిల్లల్ని తీసుకుని బయటికి నడిచింది.

"హు". ప్రశాంతంగా ఉన్న ఇంటిని చూసి నీరసంగా నిట్టూర్చింది రాధ. కళ్ళు మూసుకు పడుకుంది. బయటి ఎండకి ఉక్కపోస్తోంది. లేచి ఫేను వేసుకునే ఓపికలేకుండా వుంది. తలలో తేనెటీగల్లాగా ఆలోచనలు ముసురుకుంటున్నాయి. మనసు మాట్లాడుతోంది.


"ఛా ఛా పాడుపిల్లలు! ఒక్కక్షణం విశ్రాంతిగా ఉండనీయరు. ప్రతి నిమిషం ఏదో ఒక దానికి పట్టుదల. ఏడుపులు. రోజంతా వీళ్ళకి సేవచెయ్యటంతోనే సరిపోతోంది. దానికి జడెయ్యటం, నీళ్లుపోయటం, అంత కష్టమైనపని ఇంకోటుండదు. జడ కూర్చొని వొంగుంటుంది. పడుకుంటుంది, ఒకచే అడిపోతుంది. ఇంటి చుట్టూరా రన్నింగ్ రేస్‌లోకి మళ్లే పరుగు పెట్టితేగాని. స్నానానికి రాదు. అబ్బేబ్బే మరీ మొండి మొహంగా తయారయింది. ఇంక లాభంలేదు. దీనిసంగతి ఆయన్తో చెప్పాల్సిందే. అమ్మయ్యో లేకపోతే ఇది వంగుతుందా? చెపితే చావుదెబ్బలు కొడతారని చూస్తున్నాగానీ. బడికి పంపటానికి దాన్ని బతిమాలేటప్పటికి ప్రాణాలు కడబట్టిపోతున్నాయి. అడుగడుక్కీ అంచం పెడితే గానీ కదల్దయ్యే ఘటం. రోజూకొత్త బట్టలు ఎక్కడ తెచ్చివ్వను. ఛా ఛా విసిగించి చంపుతోంది.

ఈ వెధవ వేలెడున్నాడోలేదో వీడికెంత పట్టుదల? అది దెబ్బలు కొడితేనైనా వింటుంది. ఈ వెధవ కాస్త గట్టిగా మాట్లాడితే చాలు శృతి పెంచేస్తాడు తప్ప తగ్గటమంటూ వుండదు. కొంపలో వీడు చేసే అల్లరికి అంతుందా? బియ్యంలో బొగ్గులు పొయ్యటమేనా? పాలల్లో కిరసనాయిల్ పొయ్యటమేనా? వెధవ బోడిగుండుకి రిబ్బన్లుపెట్టి జడలెయ్యమని ఏడుస్తే జడలు నేనెక్కడ తెచ్చేది! డబ్బాలు తిరగదొయ్యటమేనా? ఛా ఛా. ఈ వెధవమేళంతో ఎక్కడికి పోవటానికీ వీలుండదు. సినిమాకి పోవటానికి లేదు. ఫ్రెండ్స్ ఇంటికి పోవటం లేదు. పోతే ఈ అల్లరిమూకనిగూడా వెంటపెట్టుకెళ్ళి నేనెక్కడ భరించగలను? ఛీ ఛీ. సరదాలన్నీ మాయమయ్యాయి. వీళ్ళలా తయారయ్యారే. పాడుపిల్లలు లేకపోయినా బాగుండును. హాయిగా స్వేచ్ఛగా వుండచ్చు. జంటగా రోడ్డుమీద పోయేవాళ్ళని చూస్తే ఈర్ష్యపుడుతోంది ఇటువంటి బాదరబందీ వాళ్ళకి లేదుగదాని."

గడియారం గంటమోతతో ఆలోచనా ప్రపంచంనుంచి బయటపడింది రాధ. నాలుగున్నర గంటలైంది. బయట ఎండ మాయమై ఆకాశమంతా నల్లని మబ్బులు పరుతున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. లేచి స్నానంచెయ్యాలి. రాధకు లేవాలనిపించటం లేదు. మనసు శరీరం అలిసివున్నాయి.

బయటనుంచి ఇంటావిడ కేక పెడుతోంది. "ఏమండోయ్ రాధాదేవీ! మా డాక్టరు మరదలొచ్చింది. రండి! కూర్చుందురుగాని."

రాధ మనసు బాధతో మూలిగింది. చిన్నతనంనుంచీ తన పేరుపక్కన ఎం.బి.బి.ఎస్. డిగ్రీ చూసుకోవాలనేది రాధ జీవితాశయం. దానికి మధ్యలోనే విఘ్నం వాటిల్లింది. పరిస్థితులన్నీ కలిసి తనని వట్టి రాధ బి.ఎ., గా




చేశాయి వెధవ డిగ్రీ పొయ్యిలో పెట్టుకోనా? డిగ్రీ లేనిమనిషి కనిపించటంలా ఈరోజుల్లో. రాధ మనసులో మృదువయిన ముచ్చటయిన 'డాక్టరు రాధ' రూపం మెదిలి కళ్ళంబడి రెండశ్రుబిందువులు రాలాయి. చిన్న సంఘటన కళ్ళముందు కొచ్చి నుంచుంది. భద్రకాళి గుడికి వెళ్ళినరోజున తన పక్కన ఇద్దరు మెడికల్ స్టూడెంట్సు నుంచున్నారు. అందులో ఒకనమ్మాయి తన్నెందుకో అమితంగా ఆకర్షించింది. మాటలసందర్భంలో తెల్సింది మెడిసిన్ చదువుతోందని. ఆరాత్రి తన కళ్ళెంత దుఃఖాన్ని భరించాయో, ఎందుకోసమో తనకే తెలియదు. అది నిరంతర వ్యథ. జీవితాంతంవరకు అది తనకి గుండెలో కలతచేసే తీరనికోరిక. నిజంగా ఇంటావిడ డాక్టరు మరదలు ఎంత అదృష్టవంతురాలో! ఆవిడ హాయిగా డాక్టరు, భర్త ఇంజనీరట. అంతకంటె జీవితంలో కోరదగిందేమిటి?

కోరిన చదువు. పదవిగల భర్త. ఎందుకూ, తనూవుంది. దురదృష్టవంతురాలు. తన జీవితంలో అనుకున్న వాటన్నిటికీ విధి ఎదురైంది. తను డాక్టరుకాదు. వట్టి రాధ బి.ఏ.. తన భర్త ఇంజనీరు కాదు. గుమాస్తా. అదైనా కావాలని కోరిచేసుకున్నది. అందుకే తనిప్పుడు మనసు విప్పి తన వ్యథ ఎవరికీ చెప్పుకోలేదు. స్వయంకృతాపరాధం. అనాడు తన వివేచనాశక్తి ఎందుకంత నశించిపోయిందో తెలియదు. మరి బంధువులంతా తన్నెందుకంత మెచ్చుకుంటారు?

"రాధ కేమమ్మా. మంచి అదృష్టవంతురాలు, రూపం, గుణం, విద్య, కోరిన భర్త, గుణవంతుడు, ఆస్తిమంతుడు, పనసపండుల్లాంటి బిడ్డలు! ఇదీ తన బంధువుల నోటంట వచ్చే వాడుక మాట. వాళ్ళకెవరికీ తన బాధ అర్థంకాదు. వాళ్ళకి ఆస్తీ, పిల్లలు వుంటే చాలు. మిగిలిన వేవీ అవసరంలేదు. తను వట్టి రాధ బి.ఏ.. గుమాస్తా భార్య. ఇద్దరు వేధించుకుతినే బిడ్డలతల్లి. మనశ్శాంతి లేని ఇల్లాలు. ఇదీ తనదృష్టిలో తన వ్యక్తిత్వానికి నిర్వచనం. దానివెనక ఎంత బాధ దుఃఖం దాగివుందో తనకే తెలియాలి.

కిటికీలోంచి విసరిన వానజల్లుకి రాధ మొహం తడిసిపోయింది. అప్పటికిగానీ తెలియలేదు. బయట వర్షం పడుతోందని. రాధ మెల్లగా లేచి తలుపులన్నీ గడియపెట్టింది. మనస్సంతా నిరుత్సాహంగాఉంది. ఇంటివాళ్ళ ఇంట్లోంచి హడావుడి. మర్యాదలూ వానలోంచి దూసుకొచ్చి వినబడుతున్నాయి. రాధ కిటికీ ఓరగా తెరచి చూసింది. ఇంటావిడ ఇంజనీరు తమ్ముడుకి, డాక్టరు మరదలుకి మర్యాదచేసే హడావిడి అదంతా. ఏదైనా అంతే. పదవిని బట్టే గౌరవ సత్కారాలు. రాధ మనసు ఈర్ష్యతో, నిరాశతో మౌనం వహించింది. "ఈయన ఆఫీసరయినప్పుడు. నే చూసినప్పుడు." నిరాదరణగా భర్త నుద్దేశించి గొణుక్కుంది.

నిముషాలు దొర్లిపోతున్నాయి. స్నానం చేసివచ్చిన రాధమనస్సులోని ఆవేశం కొంత ఉపశమించింది. మాలిన్యం అడుక్కి దిగిపోయి మనసుతేరుకుంటోంది. పేపరు వెతికి తెచ్చుకుంది చదువుదామని. బంతితో ఆడుతున్న ఇద్దరుపిల్లలు ఎడ్వర్టయిజ్మెంట్ బొమ్మల్లో నవ్వుతున్నారు. రాధకి హఠాత్తుగా సుజా, శీనులు గుర్తుకొచ్చారు. పేపరు క్రింద పారేసి తలుపు తెరిచి బయటకి చూసింది. కుండపోతగా వర్షం కురుస్తోంది. గాలికి తలుపులు కొట్టుకుంటున్నాయి భీకరంగా. రాధ వణికిపోయింది. ఎంత బుద్ధిలేనిది తను. ఇంతసేపటి నుంచి వర్షం వస్తుంటే తనకి పిల్లల విషయమే గుర్తులేకపోయింది. అయ్యయ్యో ఈ వర్షములో వాళ్ళు ఎక్కడ తడిసిపోతున్నారో ఏమో. అపని పిల్ల వొట్టి తెలివి తక్కువ మొద్దు. వీళ్ళనిఎక్కడకి తీసుకు పోయిందో ఏమో? వీళ్లు త్వరగా జేరుకుంటే దాగుండును. తన గుండె కుదుట బడుతుంది.

వర్షం జల్లును లెక్కచెయ్యకుండా రాధ వీధి గేటువైపే చూస్తోంది. వర్షంతగ్గే సూచనలు ఎక్కడా కన్పించటంలా. రానురాను హెచ్చవుతోంది. రాధ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. "భగవాన్ ఒక్క పది నిముషాలు వాన రాకుండా ఆపు. నాబిడ్డలు ఇంటికి చేరుకునేవరకు" రాధ కళ్ళుమూసుకుని మనసులోనే భగవంతుని వేడుకుంది. తదేకంగా నీటి ధారలవంక చూస్తోంది.



నెమ్మదిగా వానజోరు తగ్గింది. సన్నటి చినుకులు పడుతున్నాయి. "అమ్మయ్యా. నువ్వు దయామయుడివి తండ్రీ!" రాధ నిశ్శబ్దంగా చేతులు జోడించింది.

పదినిముషాలు గడిచిపోయాయి. కన్నార్పకుండా రాధ వీధిగేటువైపే చూస్తోంది. ఎక్కడా పిల్లలజాడలేదు. వర్షం పూర్తిగా తగ్గింది. కాని నల్లని మేఘాలు తిరిగి ఆకాశమంతా పరుచుకొంటున్నాయి. రివ్వున చల్లని గాలివీస్తోంది. ఉన్నట్టుండి మెరుపులు. హఠాత్తుగా ఆకాశం బ్రద్దలయినట్టు పెద్దచప్పుడు. "అమ్మో పిడుగుపడింది". రాధ గజగజా వణికిపోయింది. గేటుతెరుస్తున్న చప్పుడు. రాధ మొహం సంతోషంతో ప్రఫుల్లమయి తిరిగి ముడుచుకుపోయింది. గేటు గడియవేసి లోపలికొచ్చిన ఇంటివారద్బాయి విచిత్రంగా చెబుతున్నాడు: "అక్కయ్యగారూ! ఇందాక పిడుగుపడింది చూశారూ. అదేమో ఎలక్ట్రిక్ పోల్ మీద పడింది. ఎంత మంటనుకున్నారు. ఇవ్వాళ్టికి మనకు కరెంటు గోవిందః అదేగనుక మనిషిమీద పడితే ఏమవుతుందండీ?"

రాధకి వాడిని ఈడ్చి మొహంమీదకొట్టాలన్నంత కోపం వచ్చింది. దౌర్భాగ్యపు వెధవ. ఎప్పుడూ ఇటువంటి అపశకునపు వార్తలే తెస్తాడు. "ఒకవేళ ఖర్మవశాత్తు ఈ పిల్లలు ఆ పిడుగుపడ్డచోట లేరు గదా." అమ్మయ్యో. రాధగుండె కంపించిపోతోంది. వర్షంవెలిసి ఇంతసేపైనా వాళ్ళని తీసుకు రాలేదు. ఈ పాడుమొహం పనిపిల్ల ఏం ఏడుస్తోందో? రాధకోపం పనిపిల్లమీదకి తిరిగింది.

తిరిగి సన్నని వానజల్లు మొదలై క్రమంగా పెద్దదైపోతోంది. చెట్లు విరిగేటంత గాలి. గోడలు చిల్లులు పడేటట్లు వాన జోరు. రాధ నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చుంది. తడిసి గజ గజా వణికిపోతూ దీనంగా చూస్తున్న సుజా, శీనుల మొహాలు కనబడుతున్నాయి కళ్ళముందు. ఎక్కడో 'అమ్మా,

---

● ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్న గ్రాడ్యుయేట్ కుర్రాడు పర్సనాలిటీ టెస్టుకి హాజరయ్యాడు. ఇంటర్వ్యూ చేసే వారిలో ఒక మనస్తత్వవేత్త కూడా వున్నాడు. అతడు ఒక కాగితంమీద పెన్సిల్‌తో త్రిభుజం గీసి "దీన్ని చూస్తే నీకేం జ్ఞాపకం వస్తుంది?" అని అడిగాడు.

"సెక్సు" అన్నాడు అభ్యర్థి. ఒకవృత్తం గీసి "ఇదిచూస్తే?" అన్నాడు.

"సెక్సు" అన్నాడు అభ్యర్థి.

ఇంటూ గుర్తుపెట్టి "ఇది?" అని అడిగాడు.

"సెక్సే" అన్నాడు మళ్లీ అభ్యర్థి.

మనస్తత్వవేత్త పెన్సిల్ కిందపెట్టి, "మిస్టర్! నీకు ప్రపంచంలో సెక్సు తప్ప మరేమీ లేనట్టుందే?" అన్నాడు.

అభ్యర్థికి కోపం వచ్చి "నాకా? సెక్సా? కాగితంనిండా మీరు బూతు బొమ్మలు గీస్తూను?" అని లేచి వెళ్ళిపోయాడు.

అన్న ధ్వని ఆలాపన. రాధ చేతిలో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"భగవాన్ ! నేనెంత పాపిష్టిదాన్ని. బల వంతంగా పిల్లల్ని ఇంట్లోంచి పంపించేశాను. వాళ్ళ అల్లరి భరించలేనంత ఓర్పులేనిదాన్నై పోయాను. ఈ వర్షంలో ఏమైపోయారో ఏమో, చలికి గజ గజా వణికిపోతున్నారు గాబోలు. శీను ఆకలితో 'అమ్మా పాలు' అని ఏడుస్తాడు. సుజా పాపం దిగులుగా బిక్క మొహం వేసుకు చూస్తుంది. పని పిల్ల వాళ్ళిద్దర్ని పెట్టుకొని మొద్దులాగా వానలో నిలబడివుంటుంది. వర్షం వెలిసేవరకూ ఎవరింట్లోనన్నా కూర్చుందామన్న ఆలోచన తోచిందో లేదో దానికి."

గుండెలు ఝల్లుమనేట్లు ఉరుములు, మెరుపులు, వాన జోరు. "అమ్మో! ఇంతవర్షంలో తడిస్తే వాడికి మళ్ళీ ఎలాగూ నిమోనియా వస్తుంది. వాడికి వొళ్ళుకాలే జ్వరం, వూపిరి పీల్చటానికి పడేబాధ, తను చూడలేదు. ఛచ్చిపోదామనిపిస్తుంది. ఆ వొచ్చిన జబ్బు తగ్గుతుందో లేదో ? తగ్గకపోతే........


భగవాన్! ఆపై సంగతి నే నూహించ లేను. నన్నెందు కింత శిక్షిస్తున్నావు ? ఏం పాపం చేశాను ? నాతప్పులకు నాకు ఎంతటి శిక్ష విధించినా సహిస్తాను. నా బిడ్డలని మట్టుకు హింసించకు. వాడి చిలిపి అల్లరి చూడకుండా నే బ్రతకలేను. అది ఎంత తెలివిగల పిల్ల ? ఎంత చురుకయిందీ ? ఈ వానలో తడిసి ఏం సుస్తీ చేస్తుందో ఏమో ? శ్రీనివాసా ! నా బిడ్డలని సురక్షితంగా వుంచు" రాధ వెక్కి వెక్కి ఏడుస్తూ వెంకట రమణుని విగ్రహం ముందు చేతులుజోడించి ప్రార్థించింది.

మెరుపు మెరిసినట్టు ఏదో స్ఫురించింది. గంటక్రితమేగా తను పాడు పిల్లలు లేక పోయినా బాగుండును హాయిగా వుండ వచ్చనుకుంది. "భగవాన్ ! అందుకనేనా నన్నింతగా శిక్షిస్తున్నావు ? మూర్ఖురాలనై ఆవేశంలో తొందరలోఅన్నమాటలను నిజం చేస్తావా? నా అపరాధాన్ని క్షమించు. ఏడుకొండలవాడా! నాబిడ్డల భారం నీదే." రాధ మనసు గట్టిచేసుకుని పసిబిడ్డల భారం దేవుని మీద ఉంచి నిశ్చింతురాలవాలని ప్రయత్నిస్తోంది.

గడియారం ఆరుగంటలు వినిపిస్తోంది. రాధకి అప్రయత్నంగా అంతవరకు భర్త తిరిగి రాలేదని గుర్తుకొచ్చింది. పిల్లల గొడవలో అతనిసంగతే మర్చి పోయింది. ఇంతవరకు ఏం చేస్తున్నట్టు చెప్మా ? ఎంత వర్షంరానీ, గాలి రానీ ఐదున్నరగంటలకల్లా ఇల్లుజేరేమనిషి ఆరుగంటలయినా అయిపూ అజా లేదే! మూడురోజులక్రితం వర్షంలో లారీ, సైకిలు ఏక్సిడెంటయి ఒకమనిషి గుర్తు పట్టలేకుండా రక్తంముద్ద అయ్యాట్ట. ఒక వేళ అట్లా ఏమయినా ... ఛీ ఛీ ఇవాళ ఏమి టిది ? తనకన్నీ ఇటువంటి చెడ్డ ఆలోచనలు వస్తున్నాయి ? ఎంత గట్టిగా మూసుకుని వద్దనుకున్నా రాధకళ్ళముందు పొద్దుటి భర్త రౌద్రాకారం మెదులుతోంది.

"ఛీ ఛీ మళ్ళీ ఈ వెధవకొంపలో కాలు పెడితే ఒట్టు" భర్తమాటలు చెవుల్లో హోరు మ్రోగుతున్నాయి. ఆయన అన్నమాట చెల్లించుకుంటారేమో.అమ్మో! అలాఅయితే ఇంకేమన్నా వుందా? రాధకళ్ళు నిండు కొచ్చాయి. ప్రొద్దుటి సంఘటన కళ్ళ ముందు మెదిలింది.






"రాధా!, భోజనం పెడతావా ?! లేకపోతే మా దేవి వంటచెయ్యడం ఆలస్యం అయింది కనుక శెలవు మంజూరు చెయ్యవలసింది అని శెలవుచీటి పెట్టనా?" శేఖర్ పరిహాసం చేస్తూ వంటగది దగ్గరకు వచ్చాడు.

తోక తొక్కిన తాచులాగా బుస్సుమంది రాధ. "ఇంతోటి వుద్యోగానికి శెలవు పెట్ట కుండా మానేసినా ఫరవాలా".

శేఖర్ మొహం చిన్నబోయింది. రాధ వుద్దేశం ఆఫీసరయితేగాని ఉద్యోగస్తుని క్రింద లెక్కకాదని శేఖర్ కి తెలుసు. అయినా దెబ్బతిన్న అహాన్ని అదుపులో పెట్టుకుంటూ మామూలుగానే అన్నాడు.

"సరే అన్నం వడ్డించు"

"చేసేపని అదే. నాకేం పది కాళ్ళ, పది చేతులు, పదిమంది వంట మనుషులు, పది కార్లు లేవు.' రాధ తన కోర్కెలను వ్యంగ్యంగా అరిచింది.

శేఖర్ ఓర్పు అంతమయింది.

"అయితే అవన్నీ వున్నవాడిని చేసు కోక పాపం నన్ను మెడకట్టుకున్నావేం?" క్రోధంతో కూడిన జారి ప్రదర్శించాడు.

"బుద్ధిలేక!" రాధ జవాబు.

"సరే ఇంకనించి బుద్ధి తెచ్చుకో. తెలిసిందిగా"

"అలాగే" గర్వంగా రాధ సమాధానం.

"ఛీ, ఛీ, వెధవకొంప. వెధవమనుషులు ఇంక ఈ కొంపలో కాలుపెడితే ఒట్టు." విసురుగా డ్రెస్ వేసుకుని అభోజనంగా ఆఫీసుకి వెళ్ళిపోయాడు శేఖర్.

వెళ్ళిపోతున్న భర్తని వెనక్కి పిలవాలని రాధ మనసు తహ తహ లాడిపోయింది. అహంభావం అడ్డువచ్చింది. ఊరికే చూస్తూ నుంచుంది. భోజనం మానేసి తన్ను తనని శిక్షించుకుంది. ఆనీరసం మీద పిల్లల అల్లరి, గొడవ. మధ్య ఈ వెధవ వర్షం. పిల్లలు రాలేదన్న ఆవేదన. భర్త రాలేదన్న బాధ.

తన తప్పులన్నీ వేయి రెట్లయి కళ్ళ ఎదుట నాట్యం చేస్తున్నాయి. రాధ పశ్చాత్తాపంతో క్రుంగిపోతోంది. ఛీ, ఛీ తనకింత తొందరేమిటి ? ఇంత అసహనవ్యక్తిగా తయారయిందేమిటి. శేఖర్ లో ఎంత సహనం, ఓర్పు, వివేకం. తను వేటిలోనూ అతనిని సరిపోలదు. అయినా తన్నెంత ప్రేమిస్తాడు! అతని హృదయంలో తనకెంత ఉన్నతస్థానం ఉందో తనకి మాత్రమే తెలుసు. అయినా ఎందుకలా హింసిస్తోంది. అతనిలో, తనకి కావల్సింది పదవీ గౌరవాలే నా? ప్రేమాదరణలు విలువలేనివయ్యాయి తనకి ! ప్రేమలేని పదవిని తనేం చేసుకో గలదు? ఆదరణలేని బ్రతుకు విలువెంత ?

"భగవాన్ నన్నెందుకింత తెలివితక్కువ దాన్నిగా చేశావు? నా అపరాధాల్ని దయతో క్షమించు. వివేకం ప్రసాదించు. అతనూ, పిల్లలూ ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేట్లు చెయ్యి. నీ పాదాల సాక్షిగా ఇంకెప్పుడు తొందరపడి వాళ్ళని బాధపెట్టను." రాధ కన్నీటితో శ్రీనివాసుని ముందర నిశ్చల మనస్సుతో ప్రార్థించింది.

బయట వర్షం జోరు కొద్దిగా తగ్గింది.... వాన మోతలో తలుపుతట్టిన చప్పుడు. రాధ ఆత్రుతగా తలుపు తెరిచి చూసింది. తడిసి ముద్దయిన శేఖర్ లోపలికి వస్తున్నాడు. రాధ మనసు సంతోషంతో పొంగిపోయింది. వర్షంలో తడుస్తున్న సంగతికూడా మర్చిపోయి గేటుదగ్గిరికి పరుగుపెట్టింది. సైకిలు మీద సుజా శీనూలు. వెనుక పనిపిల్ల.

"పిల్లు అల్లరి చేస్తున్నారని బయటికి తరిమేశావుటగా? అరెరే ఎక్కడికి వర్షంలో తడుస్తూ? మేం వొస్తున్నాంగా లోపలికి" శేఖర్ చిరునవ్వుతో రాధని పరిశీలించాడు. ఎర్రబడిన కళ్ళు. వడిలిన పద్మంలాంటి మొహం రాధ మనస్సుని ప్రతిబింబిస్తున్నాయి. ఆమె మౌనంగా శీనూని ఎత్తుకుని కొద్దిగా తడిసిన తలని పమిట చెంగుతో అద్దుతూ లోపలికి దారితీసింది. శేఖర్ సుజాని తీసుకుని వెనకనే నడిచాడు.

"వాన వొచ్చేప్పటికి ఖంగారు పడిపోయ్యావుగదూ! వస్తుంటే దోవలో ఎవరిదో వరండాలో నుంచుని వున్నారు. అందుకని తీసుకొచ్చేశాను" శేఖర్ మృదువుగా రాధ గడ్డం పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు చిరునవ్వుతో. మంత్రముగ్ధవలె రాధ మౌనంగా కృతజ్ఞతతో కళ్ళెత్తి చూసింది. ఆ స్పర్శ, ఆ చూపు రాధకి విలువ కట్టలేని దీవెనలు. "ప్రభూ! ఈ దీవెనలు నాకు అక్షయంగా ప్రసాదించు తండ్రీ:"

అది రాధ హృదయపూర్వక ప్రార్థన. □



"ఇరువురిదీ పునర్జన్మే"

# చిత్రరథుని చైత్రయాత్ర

## "పునర్జన్మ" లోని ప్రత్యేకాత్మ

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి పతాకాన్ని నాల్గవసారిగా అత్యున్నతస్థాయిలో వెలయించగల చిత్రం 'పునర్జన్మ'. విలక్షణమైన కథ నిర్మించ సాహసించినందుకు నిర్మాత ఎ. వి. సుబ్బారావు, బహుళ జనాదరణీయంగా ఒక పిచ్చివాని కథను సాధించినందుకు దర్శకుడు ప్రత్యగాత్మ అభినందనీయులు, అనుకరణీయులు, అనుసరణీయులుకూడా.

ఈ చిత్ర కథకు ఆధారం గుల్షన్‌నందా వ్రాసిన ప్రఖ్యాత హిందీ నవల 'పత్థర్ - కి హోంట్' అంటే "రాతి పెదవులు". సుమారు పదేళ్ళుగా ఎల్. వి. ప్రసాద్‌గారి దగ్గర వున్న కథను తీసుకొని పి. ఏ. పి. వారు నిర్మించడమువావహమేగాని, అసలుకథకూ 'పునర్జన్మ' కథనానికీ వున్న సంబంధం ప్రాతిపదికలోనే గాని భావైక్యంలోగాదు. అయినా ఈ నవల ఆంధ్రదేశంలో అట్టే ప్రచారం పొందలేదు కాబట్టి ఈ అంశం విచారణీయం కానేరదు.

ఇప్పుడు చెప్పినట్టు "పునర్జన్మ" లో ప్రత్యగాత్మ ప్రతిభ తెలుస్తున్నది కాని, నవలా రచయిత ప్రతిభ కాదు. సినిమాలో వున్న కథ యిది. ఒక కళాకారునికి ప్రమాదవశాత్తు మతి భ్రమిస్తుంది. మన స్తత్వవేత్తల ఆదేశానుసారం వానికి చేదోడువాదోడుగా వుండటానికి, వికలమైన వాని మనసు సంగీత నృత్యాల ద్వారా కుదుటపరచడానికి ఒక వ్యక్తిని, ఒక వేశ్యను నియమిస్తారు. ఎలా ఆ వేశ్య స్త్రీ అయినదీ, ఆ స్త్రీ యెలా ఒక పెద్దింటికోడలయినదీ, యెలా తన కార్యం సాధించినది మిగిలిన కథ.

"పునర్జన్మ"లో అడుగడుగునా ప్రత్యగాత్మ ప్రత్యేకాత్మ శతవిధాలుగా కనబడుతుంది. ఈ చిత్రానికి సినేరియో తయారు చేసి దర్శకత్వం వహించడమే కాక, చాల మట్టుకు సంభాషణలు వ్రాసిందీ ప్రత్యగాత్మే. కొన్ని సంభాషణలు — నాలుగైదు దృశ్యాలలోవి మాత్రం ఆత్రేయవి. ఎవరు వ్రాసినా చిత్రమైనది వాటిలో ధ్వనించిన ఏకత్వం. ఒకే లక్ష్యంతో, ఒకే గమ్యం వైపు, కటువుగా, నిరంకుశంగా ప్రవహిస్తాయి. నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు యివి కొనియాడదగిన గుణాలైనా ఒకటి రెండుచోట్ల ఈ అతి సునిశిత లక్షణం, తత్సన్నివేశంలో భావపోషణకు సరిగా ఉపకరించలేదేమో అనిపిస్తుంది.